క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఖిల్వత్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మసీదుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: రంజాన్ మాసంలో మసీదుల పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మజ్లిస్ ఏరియా కమిటీపై ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్ నియోజకవర్గానికి చెందిన వివిధ డివిజన్ల మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు బదర్ ఉద్దీన్, హబీబ్ చావూస్, అలీమొద్దీన్, సయ్యద్ జబ్బార్ తదితరులున్నారు.

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఎన్జే కేన్సర్ ఆస్పత్రిలో దాదాపు 600 మంది రోగుల బంధువులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. సేవ చేయడంలోనే ఎంతో ఆనందం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, శంకర్, నితిన్ ఖురేషి, శివకుమార్, అరుణ్ జ్యోతి, చంద్రశేఖర్, జగన్ కుమార్, ఉస్మాన్ అలీ, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ఆర్‌బీఎస్ విద్యార్థి



గోల్కొండ: విద్యాబోధనలో ఎప్పటికప్పుడు అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందు వల్లే తమ విద్యార్థులు చదువుతో పాటు పోటీ పరీక్షల్లో సైతం సత్తా చాటుతున్నారని రవీంద్ర భారతి పాఠశాలల మెహిదీపట్నం డీన్ జోన్ ప్రియామనీష్ అన్నారు. నేషనల్ ఒలంపియార్డ్ టాలెంట్ టెస్ట్‌లో రవీంద్రభారతి పాఠశాలల విద్యార్థి మహ్మద్ ఫహామ్ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో 2వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మహ్మద్ ఫహామ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, డీఐ మధు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందిస్తాం'



సన్మాన కార్యక్రమంలో నందకిశోర్ వ్యాస్, పప్పుమాత్రే, పూజావ్యాస్ బిలాల్

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించేందుకు కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా నియమితులైన నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను కార్యకర్తలు, నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మురికివాడలు, బస్తీలలో ప్రతిరోజూ పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోటి శైలేష్‌కురుమ, పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం జకాత్

- ఇస్లాం ఐదు మూలసిద్ధాంతాలలో జకాత్ ఒకటి
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకుల అందజేత



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోల్కొండ: రంజాన్ మాసంలో నిరుపేదలకు జకాత్ వరంలాంటిది. జకాత్ విషయం తెలిసిన వెంటనే వందల సంఖ్యలో పేదలు క్యూ కడతారు. ఇస్లాం ఐదు మూల సిద్ధాంతాల్లో జకాత్ ఒకటి. ఓ స్థాయి దాటి డబ్బులు కలిగి ఉన్న ప్రతీ ముస్లింపై జకాత్ ఉంటుంది. ఎవరికైతే డబ్బు అవసరమో వారికి ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా ఆదుకోవడమే జకాత్. జకాత్ అంటే 'శుభ్రపరుచుట' అని అర్థం. అంటే ధనాన్ని శుభ్రపరచుకోవడం. ముస్లింల వద్ద ఎవరి దగ్గర ఎంత ధనమున్న దానిలో వేరే వారి హక్కు కూడా ఉంటుందని ఇస్లాం చెబుతోంది. మొత్తం ధనంలో 2.5 శాతం జకాత్ చెల్లించడం తప్పనిసరి. అంతేకాకుండా డబ్బును లేదా దాని ద్వారా కొన్న వస్తువును నిరుపేదల కోసం పని చేసే సంస్థలకు సైతం ఇవ్వవచ్చు. జకాత్ ద్వారా వచ్చిన విరాళాలను ఎన్జీఓలు తమ ప్రతినిధులచే గుర్తింపబడిన నిరుపేదలను గుర్తించి వారికి నిత్యావసర రూపంలో సహాయం అందించడం జరుగుతుంది. హ్యూమానిటీ ఫౌండేషన్, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ వంటి ఎన్జీఓలు తమకు వచ్చిన జకాత్ విరాళాలను రెండు దశాబ్దాలుగా మురికివాడల్లో నివసించే నిరుపేదలకు నిత్యావసరాలు అందజేస్తున్నారు.

జకాత్ ఏ విధంగా నిర్ణయిస్తారు..

ఒక వ్యక్తి తాను న్యాయబద్ధంగా సంపాదించిన డబ్బు నుంచి కొంత భాగం జకాత్‌కు ఇవ్వాలి. దీనివల్ల ఈ విధంగా జకాత్ ఇవ్వడం వల్ల ఆ వ్యక్తి సంపాదించిన ధనం దివ్య ఖురాన్‌లో చెప్పబడింది. ఎవరి దగ్గరైతే ఏడున్నర తులాల బంగారం, లేదా యాభై రెండు తులాల వెండి లేదా దానికి సమానంగా ధనం కలిగిన వారు దానిపై ప్రతి ఏడాది రెండున్నర శాతం జకాత్‌కు కేటాయించాలి. స్థిరాస్తిలో వచ్చే ఆదాయం ఎప్పటికప్పుడు ఖర్చు అయిపోతుంటే దానికి జకాత్ వర్తించదు. అదే విధంగా లక్ష రూపాయలకు మించిన బంగారం, ఇతర ఆభరణాలు సంవత్సరానికి పైగా ఉంటే దానికి జకాత్ వర్తిస్తుంది. బంగారం కానీ, ఇతర ఆభరణాలు కానీ రంజాన్ నాటికి సంవత్సరం పూర్తికాకపోతే వాటికి జకాత్ మినహాయింపు ఉంటుంది. బంగారు ఆభరణాలు తూకం వేయడంలో, స్థిరాస్తులపై ఉన్న నగదు లెక్కింపులో పారదర్శకత పాటించాలి.

జకాత్ వల్ల పేదలకు మేలు..



తమ బంగారం, ఇతర ఆదాయాల మీద జకాత్ తీసిన వారిని అల్లా ఎంతగానో ప్రేమిస్తారు. జకాత్‌ను పంపిణీ చేయడంలో నియమాలను పాటించాలి. జకాత్ సాయం అర్హులైన నిరుపేదలకే అందించేలా చూడాలి. వికలాంగులు, నిరుపేదలకు జకాత్ ఇవ్వడంలో ప్రాధాన్యమివ్వాలి.

–సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి, ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు

ఆర్.ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో..



రంజాన్ కిట్లను అందజేస్తున్న సయ్యద్ జీషానుద్దీన్

చార్మినార్: రంజాన్ మాసంలో పాతబస్తీ ఈదిబజార్‌లోని రెడ్ రోజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ జకాత్ కార్యక్రమంలో భాగంగా పేదలకు నిత్యావసర వస్తువులతో కూడిన రంజాన్ కిట్లను ఉచితంగా అందజేస్తున్నారు. సోనామసూరి బియ్యం, గోధుమ పిండి, ఎర్ర పప్పు, కందిపప్పు, మంచినూనె, చక్కెర, టీ పౌడర్, ఖర్జూరం, సేమియా డ్రై ఫ్రూట్స్.. ఇలా 21 నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను అందజేస్తున్నారు. ఈదిబజార్‌లోని ఆర్.ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయం ప్రతిరోజూ పేదలతో కిటకిటలాడుతోంది. ఆర్ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ సయ్యద్ హమీదుద్దీన్ పర్యవేక్షణలో సోమవారం రంజాన్ కిట్ల పంపిణీ కొనసాగింది.

రోటీఘర్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం...



2018 నుంచి రోటిఘర్‌ను ప్రారంభించి పేదలకు ప్రతిరోజూ నిత్యాన్నదానం చేస్తున్నాం. రంజాన్ మాసంలో ప్రతిరోజూ కిట్ల పంపిణీని కొనసాగిస్తున్నాం. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా ఏర్పడిన లాక్‌డౌన్‌లో ఇంటింటికీ నిత్యావసర వస్తువుల కిట్లను అందజేశాం.

– సయ్యద్ జీషానుద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

నాంపల్లి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ట్రేసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నాంపల్లి స్టేషన్ రోడ్డులోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వీఆర్ఏల పే స్కేల్, క్రమబద్ధీకరణ, పదోన్నతులు, వారసత్వ ఉద్యోగాలు అలాగే సమ్మె కాలానికి వేతనం వంటి అంశాలు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. దీనికి నవీన్ మిట్టల్ స్పందిస్తూ వీఆర్ఏల పే స్కేలు, ఇతర ముఖ్యమైన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్ తెలియజేశారు. అలాగే రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేడర్ల పదోన్నతుల అంశంలో కూడా సీసీఎల్ఏ సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ రాష్ట్ర జేఏసీ నేతలు రాజయ్య, వంగూరి రాములు, ఎండీ రఫీ, వెంకటేష్‌యాదవ్, మాధవనాయుడు దయాసాగర్, భరత్‌కుమార్, రాములు పాల్గొన్నారు.



వీఆర్ఏలతో ట్రేసా నేతల సమావేశం

అభినందనలు



కొత్వాల్‌దారి క్రిష్ణ మాదిగను అభినందిస్తున్న మేడి పాపయ్య మాదిగ

చార్మినార్: దళిత రత్న అవార్డు అందుకున్న టీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి, లక్ష్మీనగర్ కాలనీకి చెందిన కొత్వాల్‌దారి క్రిష్ణ మాదిగను అంబేడ్కర్, బాబై జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ మేడి పాపయ్య మాదిగ సోమవారం అభినందించారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాల సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కొత్వాల్‌దారి క్రిష్ణ మాదిగ దళిత రత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొనే క్రిష్ణకు ఈ అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

పెయింటింగ్ ఆర్టిస్ట్, హ్యాండీ క్రాఫ్ట్స్
వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం



కార్యవర్గ సభ్యులు

బంజారాహిల్స్: తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అనుబంధంగా ఉన్న తెలంగాణ సినిమా అండ్ టీవీ పెయింటింగ్ ఆర్టిస్ట్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సోమవారం బంజారాహిల్స్‌లో నిర్వహించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బి. కరుణాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్. రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా సాయికుమార్ ఎన్నిక కాగా మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు భరత్, రంగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కురకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కార్వాన్ పంచ్‌భాయ్ అలావా దత్తాత్రేయ ఆలయ పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయని, ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె వేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు విద్యుత్ శాఖ ఏఈకు సోమవారం వినతిపత్రం అందించారు. పంచ్‌భాయ్ అలావా మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆలయ పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, ఇక్కడ పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగి రోడ్డు వైపు వచ్చాయని వినతిపత్రం పేర్కొన్నారు. కాగా ఇక్కడ పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో పరిసరాల ఇళ్ల వారు చెత్త, ఇతర వ్యర్థాలను తెచ్చి ఇక్కడే డంపింగ్ చేస్తున్నారన్నారు. దీనివల్ల ఆ ప్రాంతం దుర్గంధభరితంగా మారిందని ఆలయానికి వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి

రాజేంద్రనగర్: వేసవి కాలంలో ప్రజలకు మంచి నీటిని అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని బీజేపీ చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన మంచినీటి పైపులైన్ మరమ్మత్తు పనులను ఆయన అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మంచినీటి సరఫరా పైపులైన్ పనులు నత్తనడకన సాగుతుండడంతో నీటి సరఫరా జరగక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కేశవనగర్ కాలనీ, ఎర్రబోడ, నలందానగర్, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా అసలు జరగడం లేదన్నారు. ఈమేరకు రాజేంద్రనగర్ జలమండలి జీఎం చంద్రశేఖర్, డీజీఎం జమీల్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో మూల శ్రీనివాస్‌గౌడ్, సాయియాదవ్, ఉపేందర్‌రెడ్డి, కాకుళారం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

ఆలె నరేంద్రకు నివాళి

గోల్కొండ: కేంద్రమాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు ఆలె నరేంద్ర 9వ వర్ధంతి సోమవారం జరిగింది. గుడిమల్కాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివంగత నేత ఆలె నరేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవర శ్రీనివాస్, రాధాకృష్ణయాదవ్, నామా యాదగిరి, అశ్విన్ మోదీ, ప్రభు పూజారి, శ్రీకాంత్ సాగర్ తదితరులున్నారు.

కంటి వెలుగుతో ఎంతో మేలు

మణికొండ: రాష్ట్ర ప్రజలందరి మేలు కోరి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకంలో ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని తన 19వ వార్డు మణికొండ గార్డెన్ కమ్యూనిటీ హాల్‌లో శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లోపించటంతో అనేక కంటి సమస్యలు వస్తున్నాయన్నారు.

దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

గన్‌ఫౌండ్రీ: దళితుల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అఖిలభారత అంబేడ్కర్ యువజన సంఘం, కోడ్ ఆధ్వర్యంలో దళితబంధుతో కలిగే ప్రయోజనాలపై రూపొందించిన ప్రాజెక్ట్ ఫైల్‌ను సోమవారం మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ట్యాంక్‌బండ్‌పై నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితులకు వ్యాపార అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దళితబంధు ఎంతో గొప్ప పథకం అని ఆ పథకంతో కలిగేటటువంటి బహుళ ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోడ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సీఆర్ మునిస్వామి, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, అఖిలభారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఎస్.దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బ్రోచర్‌ను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి

గోల్కొండ: సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధిపై సోమవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్‌లో ఇప్పటి వరకు మంజూరైన అభివృద్ధి పనుల నిధులు, వాటితో పూర్తి అయిన పనుల విషయంపై అడిగి తెలుసుకున్నారు. కార్వాన్ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా తీర్చిదిద్దేందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల పని తీరును మరింత మెరుగుపరచాలని, విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ ఏరియా ఆస్పత్రి పని తీరుపై తనకు ఎప్పటికప్పుడూ సమాచారం అందించాలని ఆయన కోరారు. అదే విధంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఆయన అన్నారు. ఏరియా ఆస్పత్రికి మరిన్ని ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, దాని కోసం నిధులు కేటాయిస్తానని ఆయన అన్నారు. కాగా కార్వాన్ నియోజకవర్గానికి మంజూరైన రూ.300 కోట్ల డ్రైనేజీ పనులు జోరుగా నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. హకీంపేట్ నుంచి బుల్కాపూర్ నాలా మళ్లింపు పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు.



ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

పాలాభిషేకం

చార్మినార్: ప్రపంచంలోనే తెలంగాణ పేరు చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి ఆయన పేరు పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం సత్యనారాయణ అన్నారు. సోమవారం పాతబస్తీ సుల్తాన్‌షాహీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుల సంక్షేమాన్ని పట్టించుకోని నాయకులు తమ ప్రభుత్వాన్ని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు పుస్తే శ్రీకాంత్, రాధాకృష్ణ, బొబ్బిలి శ్రీలత, నరేష్‌కుమార్, ధర్మేందర్, పెంద్యాల లక్ష్మణ్‌రావు, గోపీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న గడ్డం సత్యనారాయణ తదితరులు

రంజాన్ మాసంలో అందరూ ఖురాన్‌ను చదవాలి



మాట్లాడుతున్న సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి

గోల్కొండ: ఖురాన్ గ్రంథాన్ని ఆ భగవంతులు రంజాన్ మాసంలోనే మానవాళికి బహుమతిగా ఇవ్వడం జరిగిందని అఖిల భారత ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి అన్నారు. సోమవారం గోల్కొండ రిసాలబజార్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మదర్సా రహమత్ ఉల్ ఉలూమ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఖీరత్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం సామాన్య ప్రజలతో పాటు వ్యాపారులకు ఎంతో ప్రత్యేకమన్నారు. రంజాన్ మాసంలో తరావీ ప్రార్థనలలో ఇమామ్ ఖురాన్ గ్రంథాన్ని వినిపిస్తారని ఆయన అన్నారు. సామాన్య ప్రజలతో పాటు పగలంతా తమ తమ పనులలో ఉండేవారు రాత్రి తరావీ ప్రార్థనల్లో పాల్గొంటారన్నారు. ముస్లిం తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఖురాన్ గ్రంథాన్ని చదివే అలవాటును నేర్పించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఈజిప్ట్ నుంచి వచ్చిన ఖారీ షేక్ ముస్తఫా శ్రావ్యమైన కంఠంతో దివ్యఖురాన్ గ్రంథాన్ని పఠించాడు. ఈ కార్యక్రమంలో కుతుబ్‌షాహీ ఈద్గా ఖతీబ్, రహమత్ ఉల్ ఉలూమ్ ఫౌండర్ అండ్ సెక్రటరీ మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి, మౌలానా పీర్ సయ్యద్ షబ్బీర్ తదితరులున్నారు.

'సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి'

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే రాబోయే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తుందని, నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ దాసోజి శ్రవణ్ పేర్కొన్నారు. జాంబాగ్ డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి దాసోజి శ్రవణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్యుత్, తాగునీటి సమస్యలు లేవన్నారు. ప్రజలకు పుష్కలంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంతో పాటు అన్ని నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. బీజేపీని ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా అందరూ ఏకతాటిపై ఉండి బీఆర్ఎస్‌ను గెలిపిస్తామన్నారు. నందకిశోర్‌వ్యాస్ బిలాల్ నేతృత్వంలో నియోజకవర్గంలో పార్టీ నంబర్–1 స్థాయికి చేరుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, అనిత, ప్రియాగుప్తా, ఆర్‌వీ. మహేందర్, మాణిక్‌రావు, నందుకుమార్, శ్రీనివాస్‌గౌడ్, క్రాంతికుమార్‌తో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో దాసోజి శ్రవణ్, నందకిశోర్‌వ్యాస్ బిలాల్, ఆనంద్‌కుమార్ గౌడ్

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గోల్కొండ: మెహిదీపట్నం శ్రీ చైతన్య గ్రాడ్యుయేషన్ వేడుకలు సోమవారం పాఠశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతి ప్రీ ప్రైమరీ యూకేజీ పూర్తి చేసుకున్న చిన్నారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల జీవితాల్లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే ఒక మరుపురాని ఘట్టమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పల్లవి, ప్రైమరీ ఇన్‌చార్జి షగుప్తా, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.